# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం జిల్లాల పరిధిలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను త్వరిత గతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- ❖ కార్మికుల హక్కులను పరిరక్షించడంతో పాటూ.. వారికి ఉపాధి అవకాశాలు పెంచడమే నూతన లేబర్ కోడ్స్ లక్ష్యమని కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజే స్పష్టం చేశారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును ఈ బడ్జెట్ సమావేశాల్లోనే తీసుకురావాలని కేంద్రాన్ని కోరామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు.
- ❖ విద్యుత్ శాఖలో ఉన్న ఖాళీలను త్వరలోనే భర్తీ చేస్తామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలియజేశారు.

=====================

ప్రపంచ మార్కెట్లలో డిమాండ్ ఉన్న ఉద్యాన పంటల ఉత్పత్తులు పండించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. దానికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో 500 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పతులను పండించడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. ఆయా జిల్లాలలో ఉద్యానరంగ అభివృద్ధిపై ముఖ్యమంత్రి ఆయన క్యాంప్ కార్యాలయంలో ఈరోజు సమీక్ష నిర్వహించారు. పూర్వోదయ, సాస్కి, రాష్ట్ర ప్రభుత్వ నిధుల వినియోగంలో సమన్వయం చేసుకుంటూ.. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అదే విధంగా రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం జిల్లాలలో సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రాధాన్యతల వారీగా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని, వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఈ ఏడాదిలో పూర్తి చేయాలని అధికారులకు చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

=====================

కార్మికుల హక్కుల పరిరక్షణ, ఉపాధి అవకాశాల పెంపు, పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పించడమే నూతన లేబర్ కోడ్స్ ప్రధాన లక్ష్యమని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే అన్నారు. విజయవాడలో జరుగుతున్న 3వ కార్మిక, ఉపాధి కల్పన మరియు పరిశ్రమల శాఖల కార్యదర్శుల ప్రాంతీయ సదస్సుకు మంత్రి ఈరోజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నూతన లేబర్ కోడ్స్ ప్రకారం 40 ఏళ్లు పైబడిన కార్మికులకు సంవత్సరానికి ఒకసారి ఉచితంగా హెల్త్ చెకప్, ఓవర్ టైమ్ పని చేసిన వారికి రెట్టింపు వేతనం, ప్రమాదకర రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు నూరు శాతం ఆరోగ్య భద్రత, అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం కార్మికులకు సామాజిక న్యాయం కల్పిస్తామని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత పాలన ద్వారా పారదర్శకత, వేగవంతమైన సేవలు, సులభమైన కంప్లయన్స్ సాధ్యమవుతాయని అన్నారు. మహిళల భాగస్వామ్యం పెంపు, పని ప్రదేశాల్లో భద్రత, సమాన అవకాశాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని శోభా కరంద్లాజే తెలియజేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

=====================

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో అఖిలపక్ష సమావేశాన్ని ఈరోజు నిర్వహించింది. పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రానికి చెందిన వివిధ అంశాలపై ఈ బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలని కేంద్రాన్ని కోరామని చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత అమరావతిని ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిగా నిర్ణయించారని.. కానీ గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఈ సమావేశాల్లోనే తీసుకురావాలని కోరామన్నారు. పూర్వోదయ పథకం కింద వీలైనన్ని ఎక్కువ నిధులు రాష్ట్ర నీటిపారుదల ప్రాజెక్టులకు ఇవ్వాలని.. నదుల అనుసంధానానికి సహకరించాలని విజ్ఞప్తి చేశామన్నారు. పొగాకు కొనుగోళ్ల సమస్యను పరిష్కరించాలని అఖిలపక్ష సమావేశంలో ప్రస్తావించామని లావు శ్రీకృష్ణదేవరాయలు వెల్లడిస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

=====================

విద్యుత్ శాఖలో ఉన్న ఖాళీలను త్వరలోనే భర్తీ చేస్తామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రెడ్డిపాలెంలో 3 కోట్ల 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సబ్ స్టేషన్ ను ఆయన ఈరోజు ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. మొదటి విడతలో 600 సహాయక ఇంజనీర్ పోస్టులను భర్తీ చేస్తామన్నారు.

విరామం

=====================

రాష్ట్రంలో మాదకద్రవ్యాల కట్టడికి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టిందని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. డ్రగ్స్‌పై దండయాత్ర పేరిట విజయవాడలో ఈరోజు ఒక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ.. ఈగల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి డ్రగ్స్ అక్రమ రవాణాను నిలువరించామన్నారు. గంజాయి తరలించినా, సాగు చేసినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని హోం మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

=====================

దేశ వారసత్వం, సాంస్కృతిక సంపదను కాపాడుకోవాల్సిన ప్రధాన బాధ్యత యువతపైనే ఉందని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ పేర్కొన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ పిలుపు మేరకు "మేరా యువ భారత్" ఆధ్వర్యంలో విశాఖపట్నంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ చివరి రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి పాల్గొన్న 37 మంది యువతీ, యువకులతో శ్రీభరత్ ముచ్చటించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ... భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిబింబించే భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడే బాధ్యత యువత పైనే ఉందన్నారు.

=====================

రాష్ట్రంలో కొత్తగా 13 ప్రజారోగ్య లేబొరేటరీలు రాబోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు నమూనాల పరీక్షల నిమిత్తం ప్రాంతీయ ఆసుపత్రుల్లో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీలు (IPHL) ఏర్పాటవుతున్నాయి. ఇవి ఏప్రిల్ నాటికి వినియోగంలోకి వస్తాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. వీటి నిర్మాణాల పూర్తికి అవసరమయ్యే యంత్రాలు, పరికరాలు సరఫరా అవుతున్నాయని మంత్రి ఈరోజు ప్రకటనలో తెలిపారు. సంక్రమిక, అంసక్రమిక వ్యాధులకు సంబంధించిన మొత్తం 134 రకాల పరీక్షలు ఈ లేబొరేటరీలలో జరుగుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో ఉన్న ల్యాబ్ లు ఐపీహెచ్ఎల్ రాకతో మరింత బలోపేతమవుతాయని చెప్పారు.

=====================

విశాఖపట్నంలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియాన్ని ఆధునీకరించేందుకు 16.90 కోట్ల రూపాయలతో చేపట్టిన పనులు పూర్తవడంతో ఈరోజు ఘనంగా పునఃప్రారంభమైంది. ఈ స్టేడియాన్ని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీభరత్, విశాఖ ఉత్తరం నియోజకవర్గ శాసన సభ్యులు పి. విష్ణు కుమార్ రాజుతో కలిసి ప్రారంభించారు. ఆధునీకరణలో భాగంగా స్టేడియంలో సెంట్రల్ ఎయిర్ కండిషనింగ్, 6 బ్యాడ్మింటన్ కోర్టులు, 1,750 సీట్ల సామర్థ్యం, అలాగే పూర్తి స్థాయి సీసీ కెమెరా నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశారు.

=====================
=====================